# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 96 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 09 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 96 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 09 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-


## ఢిల్లీలోని ఏమ్స్ లో భారీ అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశరాజధాని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఎయిమ్స్ లోని రెండో అంస్తులో గల ఎండోస్కోపీ రూమ్ లో ఒక్కసారిగా మంటలు




మిగతా 2లో...

సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత

## ఇండియా కూటమి పక్షాలకు లేదు

నిన్న రాజ్యసభలో సెమీ ఫైనల్స్‌లో ఇండియా కూటమి పరాజయం

విపక్ష కూటమి ఇండియా పై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

విపక్ష కూటమి ఇండియా పై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఇండియా కూటమిపై మోదీ విరుచుకుపడ్డారు. ఇండియానుంచి కుటుంబ పాలనకు, అవినీతికి, అవకాశవాద రాజకీయాలకు ముక్తి లభించాలన్నారు. నిన్న రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీల కూటమికి సెమీ ఫైనల్స్ అని.. సెమీస్‌లోనే ఇండియా కూటమి ఓడిపోయిందన్నారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత ఇండియా కూటమి పక్షాలకు లేదని మోదీ అన్నారు. సామాజిక న్యాయానికి ఇండియా కూటమి పార్టీల

మిగతా 2లో...




# మునుగోడు మొనగాడెవరో..!

- టాక్ ఆఫ్ ది పాలిటిక్స్‌గా రాజకీయ ముఖచిత్రం
- గతేడాది ఉప ఎన్నికతో అందరి దృష్టి మునుగోడుపైనే..
- ఎక్కువగా ప్రజా ఉద్యమాల ప్రభావం




నల్గొండ- ప్రభాత సూర్యుడు

తెలంగాణలో ఎన్నికల వేడి మొదలైంది. ప్రధాన పార్టీలు రేసు గుర్రాలపై దృష్టిపెట్టాయి. గతేడాది ఉపఎన్నికతో అందరి దృష్టిని ఆకర్షించింది మునుగోడు. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ప్రధాన పార్టీల నుంచి ఎవరు పోటీ చేయబోతున్నారనేది మరోసారి ఆసక్తికరంగా మారింది.మరికొద్ది రోజుల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల యుద్ధం మొదలుకా బోతుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు... వ్యూహాలు, ప్రతి వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. పోటీలో నిలిచి గెలిచే వారి జా బితాను కూడా రెడీ చేసుకునే పనిలో పడ్డాయి. కీలకమైన స్థానాల విష యంపై కూడా మేథోమథనం చేస్తున్నాయి. ఓ రకంగా చెప్పా లంటే... ఇప్పటికే ఎన్నికల మూడ్ లోకి వెళ్లిన పార్టీలన్నీ ప్రత్యర్థిని ఢీకొట్టే దిశగా అడుగులు వేస్తు న్నాయి. ఇక గతేడాది తెలంగాణ రాజకీయాలనే

మిగతా 2 లో...

అవిశ్వాస తీర్మానంపై చర్చకు

## 2 రోజుల్లో 16 గంటల సమయం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చకు 2 రోజుల్లో మొత్తం 16 గంటల సమయం కేటాయించారు. బీజేపీకి 6 గంటల 41 నిమిషాలు, కాంగ్రెస్‌కి 1 గంట 9

మిగతా 2లో...

## హిట్ లిస్టులో 49 మంది

ఇంటెలిజన్స్ రిపోర్ట్ పై కసరత్తులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 49 మంది డేంజర్ జోన్లో ఉన్నారు. వారికి టికెట్ ఇస్తే ఓటమి ఖాయమని గులాబీ బాస్‌కు ఇంటెలిజెన్స్ రిపోర్టు ఇవ్వడంతో ఆ నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయంపై కసరత్తు ప్రారంభించారు. ఇతర పార్టీల్లో బలమైన నేతలపైనా ఆరా తీస్తున్నారు. డేంజర్ జోన్‌లో ఉన్న వారి గురించి ఆయా జిల్లాల మంత్రుల నుంచి ఫీడ్ బ్యాక్‌ను కేసీఆర్ తీసుకుంటున్నారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీ రావాలని అధిష్టానం ప్రణాళికలు రూపొందిస్తుంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. ఎమ్మెల్యేల పని తీరుపైనా నిఘా పెట్టింది. ఇప్పటికే పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించింది. వారి పనితీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయంను ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సేకరిస్తుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి 104 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.సిట్టింగ్‌లకే వచ్చే ఎన్నికల్లో టికెట్ సైతం ఇస్తామని ప్రకటించినప్పటికీ.. వారిలో 49 మంది డేంజర్ జోన్‌లో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు నివేదికను ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే వారికి టికెట్ ఇస్తే ఈసారి ఓటమి ఖాయమని చెప్పినట్లు సమాచారం. ఫీల్డ్ సర్వే నిర్వహించిన తర్వాతనే రిపోర్టు ఇచ్చామని వర్గాలు తెలిపాయి. అయితే ఆ 49

మిగతా 2లో...

నూతనోత్సాహంతో

## రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం పునరుద్ధరణ అయిన తర్వాత నూతనోత్సాహంతో మంగళవారం ఉదయం పార్లమెంటుకు బయల్దేరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై చర్చను ఆయన ప్రారంభించబోతున్నారు. ఆయన మోదీ ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ఎండగట్టబోతున్నారు. కాంగ్రెస్ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, అవి శ్వాస తీర్మానంపై చర్చను రాహుల్ గాంధీ

మిగతా 2లో...

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు

## గవర్నర్ లేఖలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ప్రభుత్వం – గవర్నర్ తమిళిసై మధ్య పరిస్థితి ఉప్పు – నిప్పులా ఉంది. విమర్శలు, ప్రతివిమర్శలతో రెండు రాజ్యాంగ వ్యవస్థలు ఘర్షణ పడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పలు బిల్లులపై గవర్నర్ చర్య వార్తల్లో నిలిచింది. ఆర్టీసీ బిల్లులపై ప్రశ్నలు లేవనెత్తడం సహా ఆర్టీసీ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడం వంటివి జరిగాయి. గవర్నర్ తీరుపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు గుర్రుగా ఉన్నారు. ఈ సమయంలోనే గవర్నర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. చాలా

మిగతా 2లో...

## ధరణి.. పెద్దల కోసమే..!

ఒకే రోజు 44 మంది జననం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు





ధరణి పేదల కోసం కాదు.. పెద్దల కోసం అని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న కలెక్టర్లకు టార్గెట్లు పెట్టారు అని ఆయన ఆరోపించారు. చట్ట సభలపై కేసీఆర్ కి నమ్మకం సన్నగిల్లింది.. బడ్జెట్ సమావేశాలు 11 రోజులు.. వర్షాకాల సమావేశాలు 3 రోజులు.. ఈ ఏడాది మొత్తం 14 రోజులు మాత్రమే అసెంబ్లీ సమావేశాలు జరిగాయని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏడాదికి 60 రోజుల పాటు సమావేశాలు జరిగేవి.. కానీ ఇప్పుడు జస్ట్ 14 రోజుల మాత్రమే జరుగుతున్నాయి.రాష్ట్రంలో ఎమ్మెల్యేలు అంటే నియోజకవర్గాల్లో ఉండే వాళ్ళుగా.. పోలీస్ స్టేషన్లకు ఫోన్ చేసే వాళ్ళుగా మార్చారు ఈటల రాజేందర్ అన్నారు. అసెంబ్లీలో నేడు 4 పార్టీలే ఉన్నాయి.. ఉమ్మడి రాష్ట్రంలో 15 పార్టీలు ఉండేవి.. అన్ని పార్టీలతో బీఏసీ సమావేశం నిర్వహించేవారు.. జాతీయ పార్టీగా ఉన్న బీజేపీని బీఏసీ మీటింగ్ కు పిలువలేదు.. గతంలో ఒక్క ఎమ్మెల్యే ఉన్న జయప్రకాష్ నారాయణను కూడా బీఏసీ సమావేశంలో

మిగతా 2లో...

కలవరపెడుతున్న

## కరోనా కొత్త వేరియంట్



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కొవిడ్ కొత్త వేరియంట్.. పేరు ఎరిస్. కోవిడ్ థర్డ్‌వేవ్‌లో ప్రపంచాన్ని భయపెట్టిన ఒమిక్రాన్‌కి ఇది సబ్ వేరియంట్. బ్రిటన్‌లో పుట్టి.. ఆ దేశాన్ని తీవ్రంగా వణికిస్తోంది. జూలై 3న ఎరిస్ వేరియంట్

మిగతా 2లో...

### సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత

# ఇండియా కూటమి పక్షాలకు లేదు

(మొదటిపేజీ తరువాయి)
వల్లే నష్టం జరిగిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన సెమీ ఫైనల్స్‌లో ఇండియా కూటమి పరాజయం పాలైందని మోదీ అన్నారు. 2024 ఓటింగ్‌కు ముందు సెమీఫైనల్ అని కొందరు అహంకారంతో అన్నారన్నారు. సెమీఫైనల్‌లో విజయం సాధించినందుకు ఎన్డీఏ ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆగస్ట్ 9 నుంచి బీజేపీ మరో క్విట్ ఇండియా నినాదం ప్రారంభమవుతుందన్నారు. ఆగస్టు 14న విభజన దినాన్ని జరుపుకుందామని మోదీ అన్నారు. స్వాతంత్ర్య అమృత్ మహోత్సవ్ కార్యక్రమం పూర్తికాగానే ప్రతి గ్రామం నుంచి అమృత కలశ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రణాళిక ఇందులో ఉందన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి, ఆ ఇంటి పెద్దకు ఈ ప్రణాళికను ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో 75 మొక్కలు నాటాలన్నారు. ఆ తర్వాత ఈ కార్యక్రమం తహసిల్, జిల్లా, రాష్ట్ర స్థాయిని దాటుకుని ఢిల్లీకి చేరుకుంటుందని మోదీ అన్నారు.

### అవిశ్వాస తీర్మానంపై చర్చకు

# 2 రోజుల్లో 16 గంటల సమయం

(మొదటిపేజీ తరువాయి)
నిమిషాలు, డీఎంకేకి 30 నిమిషాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 30 నిమిషాలు, వైఎస్సార్సీపీకి 29 నిమిషాలు, శివసేనకు 24 నిమిషాలు, జేడీయూకి 21 నిమిషాలు, బీజేడీకి 16 నిమిషాలు, బీఎస్పీకి 12 నిమిషాలు, బీఆర్ఎస్‌కి 12 నిమిషాలు, ఎల్‌జేఎస్పీకి 8 నిమిషాలు చొప్పున సమయాన్ని కేటాయించారు. మిగిలిన ఎన్‌డీఏ అనుకూల పార్టీలు, స్వతంత్ర ఎంపీలకు 17 నిమిషాలు కేటాయించారు. ఇందులో అన్నాడీఎంకే, ఏజేఎస్‌యూ, ఎంఎన్‌ఎఫ్, ఎన్‌పీపీ, ఎస్‌కేఎం వంటి పార్టీలు ఉన్నాయి. ఇక ఎస్పీ, ఎన్‌సీపీ, సీపీఐ, టీడీపీ, జేడీఎస్, శిరోమణి అకాలీదళ్, ఆమ్ ఆద్మీ వంటి పార్టీలన్నింటికి కలిపి 52 నిమిషాల సమయం ఇచ్చారు. బీజేపీ తరపున 15 మంది వక్తలు మాట్లాడనున్నారు. నిషికాంత్ దూబే మొదటి వక్తగా వ్యవహరిస్తారు.

### ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు

# గవర్నర్ లేఖలు

(మొదటిపేజీ తరువాయి)
అరుదుగా వాడే రాజ్యాంగ నిబంధన ఆర్టికల్ 174(2) ను గవర్నర్ వాడారు. చాలా అరుదుగా మాత్రమే వాడే ఈ ఆర్టికల్ ను తమిళిసై అమలు చేయడం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఆర్టికల్ 175(2) ప్రకారం గవర్నర్.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నేరుగా లేఖ రాయవచ్చు. శాసనసభలో పెండింగ్ లో ఉన్న బిల్లుకు సంబంధించి రాష్ట్ర శాసనసభకు లేదా ఇరు సభలకు సందేశాలు పంపవచ్చు. అలాగే గవర్నర్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది అని ఆర్టికల్ 175(2) చెబుతోంది. అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ద్వారా పెండింగ్ బిల్లులపై తమిళిసై రాష్ట్ర అసెంబ్లీ ఉభయ సభలకు సందేశం పంపించారు. సాధారణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా గవర్నర్లు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతారని, ఇది అరుదైన ఘటన అని న్యాయ నిపుణులు అన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ (సవరణ) బిల్లు 2023, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిస్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్‌అన్యువేషన్) (సవరణ) బిల్లు 2022, తెలంగాణ మున్సిపల్(సవరణ) బిల్లు 2022 లపై గవర్నర్ ఇరు సభల సభ్యులకు లేఖ రాశారు. బిల్లులను గవర్నర్ తమిళిసై ప్రభుత్వానికి తిరిగి పంపడంతో వాటిని మళ్లీ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వీటిని ఇప్పుడు మళ్లీ రాజ్ భవన్ కు పంపితే, వాటిపై సంతకం చేయడం మినహా గవర్నర్ చేసేదేమీ లేదు. అలాగే గవర్నర్ ఇరు సభల సభ్యులకు పంపిన సందేశాన్ని చదివారా.. చర్చ జరిగిందా లేదా అని తెలుసుకోవాలని అనుకుంటున్నట్లు రాజ్ భవన్ వర్గాలు చెబుతున్నాయి. అయితే గవర్నర్ నుంచి ఒక సందేశం వచ్చిందని, దానిని సభ్యులందరికీ పంపించినట్లు స్పీకర సభకు తెలియజేశారు.

# ఢిల్లీలోని ఏమ్స్ లో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)
చెలరేగాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు అందులోని వారందరినీ బయటకు పంపించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. 6 ఫైర్ ఇంజన్లు మంటలను అదుపు చేస్తున్నాయి.

# మునుగోడు మొనగాడెవరో..!

(మొదటిపేజీ తరువాయి)
షేక్ చేసేలా మునుగోడు బైపోల్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఇక్కడ్నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఎవరు..? మునుగోడులో రాజకీయం ఎలా ఉండబోతుందన్న చర్చ ఇప్పుడిప్పుడే తెరపైకి వస్తోంది. గతేడాది బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు కొత్తవారు కూడా ప్రయత్నాల్లో ఉండటంతో మునుగోడు రాజకీయ ముఖచిత్రం ఎలా ఉండబోతుందనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఓ అసెంబ్లీ నియోజకవర్గం మునుగోడు. బీసీ జనాభా ఎక్కువగా ఉండటమే కాదు... ప్రజా ఉద్యమాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నియోజకవర్గం ఏర్పడిన రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం ఉండగా... ఆ తర్వాత కమ్యూనిస్టుల కంచుకోటగా మారిపోయింది. కానీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రభావం, వర్తమాన రాజకీయల్లో చోటు చేసుకుంటున్న పరిస్థితులతో ఇక్కడ కమ్యూనిస్టుల ప్రభావం తగ్గిపోయింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గులాబీ జెండా ఎగిరింది. ఆ తర్వాత జరిగిన ముందస్తు ఎన్నికల్లో హస్తం పార్టీ వికర్టీ కొట్టింది. అనూహ్యంగా కాంగ్రెస్ నుంచి గెలిచిన రాజగోపాల్ రెడ్డి... బీజేపీలో చేరటం, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయటంతో గతేడాది ఉపఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో భాగంగా కామ్రేడ్లతో పొత్తు పెట్టుకున్న బీఆర్ఎస్... 10 వేల మెజార్టీతో విజయం సాధించింది. ఇక మరికొద్ది నెలల్లోనే మరోసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... ప్రధాన పార్టీల నుంచి పాత అభ్యర్థులే బరిలో ఉంటారా లేక మారుతారా అన్న చర్చ నియోజకవర్గంలో జోరందుకుందిగతేడాది జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ నుంచి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కుమార్తె స్రవంతి బరిలో నిలవగా... బీఆర్ఎస్ నుంచి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నిలబడ్డారు. ఇక బీజేపీ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ 10 వేల ఓట్లకు పై మెజార్టీతో గెలవగా... బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. ఇక కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన స్రవంతికి కేవలం 23వేల ఓట్లు వచ్చాయి. డిపాజిట్ కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. ఇక భారీ అంచనాలతో దిగిన బీఎస్పీకి కేవలం 4 ఓట్లు రాగా... ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కు 805 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు మారే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ నుంచి చల్లమల్ల కృష్ణారెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో అన్నీతానై నడిపిస్తున్నారు. పార్టీ అధ్యక్షుడి ఆశీస్సులు కూడా ఆయనకు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. దాదాపు ఆయనే బరిలో ఉంటారని తెలుస్తోంది. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోటీపై అనేక రకాలుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం బీజేపీలోనే కొనసాగుతుండగా.. మళ్లీ ఇక్కడ్నుంచే పోటీ చేస్తారా లేదా అనే దానిపై క్లారిటీ రావటం లేదు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉందన్న టాక్ కూడా వినిపిస్తోంది. ఒకవేళ అలా జరగకపోతే... బీజేపీ అభ్యర్థిగా మునుగోడులో మళ్లీ ఆయనే పోటీ చేయటం ఖాయంగా కనిపిస్తోంది. ఆయన బరిలో ఉండకపోతే... పార్టీ సీనియర్ నేత మనోహర్‌రెడ్డి ఉండే ఛాన్స్ ఉంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విషయానికొస్తే అత్యంత ఆసక్తిని రేపుతోంది. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే కూసుకుంట్లకు టికెట్ దక్కే అవకాశాలు చాలా తక్కువ అన్న చర్చ నియోజకవర్గంలో జోరుగా నడుస్తోంది. గత ఉపఎన్నికల టైంలోనే ఆయన అభ్యర్థిత్వాన్ని సొంత పార్టీ నేతలే తీవ్రంగా వ్యతిరేకించారు. హైకమాండ్ పెద్దల ఎంట్రీతో అసమ్మతి నేతలతో చర్చలు జరిపి ఒప్పించే ప్రయత్నం చేశారు. ఉపఎన్నిక కోసం పార్టీ అంతా కష్టపడినప్పటికీ... ఆయనకు కేవలం 10 వేల మెజార్టీనే వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయనకు మరోసారి టికెట్ ఇస్తారా లేదా అనేది అనుమానంగా మారింది. ఇదే సీటుపై పార్టీ సీనియర్ నేత కర్నె ప్రభాకర్ కన్నేశారు. ఆయనే కాకుండా... నారబోయిన రవి కూడా సీటును గట్టిగా ఆశిస్తున్నారు. ఇటీవలే బీఆర్ఎస్ లో చేరి కార్పొరేషన్ ఛైర్మన్ గా అవకాశం దక్కించుకున్న జర్నలిస్ట్ నేత పల్లె రవి కుమార్ గౌడ్ కూడా సీరియస్ గా ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఎవరికి వారుగా ప్రయత్నాల్లో ఉంటే... కొద్దిరోజులుగా గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు. సామాజిక, సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలతో కూడా సంప్రదింపులు జరుపుతూ... గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో పడ్డారు. పార్టీ టికెట్ దక్కించుకొని మునుగోడు లేదా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఏదైనా ఒక నియోజకవర్గం నుంచి బరిలో ఉండాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపు అభ్యర్థిగా ఎవరు ఉంటారనేది మాత్రం అత్యంత ఆసక్తికరంగా మారింది. ఇక బీఎస్పీ నుంచి మరోసారి శంకరాచారినే ఉండే అవకాశం ఉంది. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.... మరోమారు మునుగోడు పాలిటిక్స్ రసవత్తరంగా మారటం ఖాయంగా కనిపిస్తోంది. ఇక రేసులో ఉండే అభ్యర్థులు ఎవరనే దానిపై రాబోయే రోజుల్లో మరింత క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది.

# హిట్ లిస్టులో 49 మంది

(మొదటిపేజీ తరువాయి)
అసెంబ్లీ నియోజకవర్గాలపై కేసీఆర్ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. సిట్టింగ్‌లపై ప్రజా వ్యతిరేకత ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లపై కేసీఆర్ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో ఏ పార్టీ బలంగా ఉందనే వివరాలతో పాటు బలమైన నేత ఎవరు..? ఆయన బయోడేటాను సైతం సేకరిస్తున్నట్లు సమాచారం. తాజాగా 49 నియోజకవర్గాల్లో వ్యతిరేకత ఉందని వచ్చిన నివేదిక ప్రకారం ఆ నియోజకవర్గాల్లో ఎవరిని బరిలో దింపితే గెలుస్తామనే కసరత్తు సైతం ప్రారంభించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వబోమని సంకేతాలను కేసీఆర్ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే వాటితో పాటు మరికొన్ని నియోజకవర్గాల్లో సైతం సిట్టింగ్‌లపై వ్యతిరేకత పెరుగుతోందని సర్వేల్లో వెల్లడవుతున్నది. మరోసారి విజయం సాధించి రాష్ట్రంలో హ్యాట్రిక్ సీఎం అవుదామనుకుంటున్న కేసీఆర్‌కు సర్వేలు షాక్ ఇస్తున్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నేతలను సైతం అప్రమత్తం చేశారు. సర్వేల్లో ఎవరికి అనుకూలంగా వస్తే వారికే టికెట్ ఇస్తామని మరోవైపు మంత్రి కేటీఆర్ సైతం సిట్టింగ్లపై అసమ్మతి ఉన్న నియోజకవర్గాల నేతలతో భేటీ అవుతూ పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే జిల్లా ఇన్ చార్జీగా ఉన్న మంత్రులతో కేసీఆర్ ఆయా జిల్లాలోని నియోజకవర్గాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి జిల్లా పరిధిలోని సెగ్మెంట్లలో సిట్టింగ్‌పై ప్రజా వ్యతిరేకత ఉన్న నేతల వివరాలను తెలుసుకున్నారు. ఆ నియోజకవర్గంలో వ్యతిరేకత గల కారణాలను గులాబీ బాస్ అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకపోవడంలో వైఫల్యమా..? ప్రభుత్వ పథకాలను ఓన్ చేసుకోకపోవడమా? లేకుంటే నేత నిర్లక్ష్యమా? ఇతరాత్ర కారణాలను తెలుసుకుంటున్నారుఇతర పార్టీల్లో బలమైన నేత ఉంటే మన పార్టీలోకి తీసుకురావాలని, వారికి కండువా కప్పడంతో పాటు పదవుల ఆశ చూపాలని కూడా సూచించినట్లు తెలిసింది. విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, అందుకు కావాల్సిన వనరులను సమకూర్చుతామని కూడా కేసీఆర్ హామీ ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆదివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సైతం కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తామని, 2018 ఎన్నికల్లో కంటే ఏడెనమిది సీట్లను ఎక్కువగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే అందుకు భిన్నంగా ఇంటెలిజెన్స్ రిపోర్టులు వస్తుండటంతో నేతలకు మరోసారి సీరియస్‌గా ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. మంత్రులపై సైతం మండిపడినట్లు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనప్పటికీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతమంది సిట్టింగ్‌లకు టికెట్ నో చెబుతారో అనేది హాట్ టాపిక్‌గా మారింది.

# ఢిల్లీలో డెంగ్యూ..

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశ రాజధాని ఢిల్లీలో డెంగ్యూ విజృంభిస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా రోజురోజుకీ వ్యాప్తి వేగవంతమవుతోంది. గత వారం రోజుల్లోనే 105 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం డెంగ్యూ కేసుల సంఖ్య 348 కి చేరింది. అందులోనూ.. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ పరిధిలోని వెస్ట్, సౌత్, నజఫ్‌గఢ్ జోన్లలో అత్యధిక కేసులు నమోదయ్యాయి. గడిచిన ఐదేళ్లలో ఆగస్టు 6 నాటికి తొలిసారి 175 డెంగ్యూ కేసులు నమోదుకాగా.. ఆగస్టు తొలివారంలో తొలిసారి వందకు పైగా డెంగ్యూ కేసులు రికార్డ్ కావడం ఢిల్లీ ప్రజల్ని కంగారు పెడుతోంది. మరోవైపు.. పరీక్షల కోసం పంపిన 20 శాంపిల్స్‌లో 19 'తీవ్రమైన' టైప్ 2 డెంగ్యూ స్ట్రెయిన్‌ను కనుగొనడం ఆందోళన కలిగిస్తోంది. డెంగ్యూ విజృంభణతో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అప్రమత్తమయ్యింది. ఎక్కడికక్కడ టెస్టులు నిర్వహిస్తోంది. డెంగ్యూతోపాటు సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఢిల్లీ ప్రభుత్వం, మునిసిపల్ కార్పొరేషన్ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. గత నెలలో భారీ వర్షాలు, వరదలు ఢిల్లీని ముంచెత్తాయి. యమునా నది ఉప్పొంగడంతో షేక్ అయింది. వరదల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాలు రోజుల తరబడి నీటిలోనే మునిగిపోవడంతో దోమల ఉత్పత్తి పెరిగింది. ఇప్పటికీ.. కొన్ని ప్రాంతాలను బురద భయం వెంటాడుతోంది. అదే సమయంలో.. మున్సిపల్ సిబ్బంది కూడా సమ్మె చేయడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది.

### నూతనోత్సాహంతో

# రాహుల్ గాంధీ

(మొదటిపేజీ తరువాయి)
ప్రారంభిస్తారు. మణిపూర్ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతారు. రాహుల్ జూన్‌లో మణిపూర్‌లో పర్యటించి, స్థానిక పరిస్థితులను తెలుసుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు ప్రతిపక్ష కూటమి ఇండియా (ఎ.ఐ.ఆ.ఎ.ం) ఎంపీలు కూడా ఆ రాష్ట్రంలో పర్యటించి, స్థానిక సమస్యలను పరిశీలించి, గవర్నర్‌కు, రాష్ట్రపతికి నివేదికలు సమర్పించారు. 'మోదీ ఇంటి పేరు' కేసులో రాహుల్ గాంధీ దోషి అని గుజరాత్‌లోని సూరత్ కోర్టు తీర్పు చెప్పడంతో ఆయన లోక్ సభ సభ్యత్వం రద్దయిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టులో ఆయనకు ఊరట లభించడంతో ఆయన లోక్ సభ సభ్యత్వం పునరుద్ధరణ అయింది.

# ధరణి.. పెద్దల కోసమే..!

(మొదటిపేజీ తరువాయి)
పాల్గొనే వారు అని ఈటల అన్నారు. బీజేపీ సభ్యులకు అసెంబ్లీలో ఒక్క రూమ్ కేటాయించాలని స్పీకర్ ను వేడుకున్నా.. పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. తెలంగాణ సమావేశాలు సజావుగా సాగిందని చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది అని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. స్పీకర్ మా వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు.. ప్రభుత్వాన్ని అధికార పార్టీ సభ్యుల కంటే ఎక్కువగా ప్రతిపక్ష పార్టీ ఎంఐఎం పొగడటం జుగుప్సాకరంగా ఉందన్నారు. ప్రజల మీద, ప్రజాస్వామ్యం, చట్ట సభల మీద బీఆర్ఎస్ నేతలకు నమ్మకం లేదు అని ఈటల విమర్శించారు. ఈ సభతో బీఆర్ఎస్ కి బై బై చెప్పినట్లేనని అన్నారు. రాష్ట్రంలో వరదలతో 41 మంది కొట్టుకుపోయారు.. అసెంబ్లీలో కనీసం సంతాపం చెప్పలేదు అని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. వరదలతో చాలా మంది నష్టపోయారు.. కనీసం ప్రభుత్వం సహాయం చేయలేదు.. 109 సీట్లు వస్తాయని అహంకారంతో సీఎం కేసీఆర్ చెబుతున్నారు.. మూడు రోజులు అసెంబ్లీ సమావేశాలు జరిగితే.. ఒకరోజు హరీష్ రావు.. రెండోరోజూ కేటీఆర్.. చివరి రోజు కేసీఆర్ ప్రతిపక్షాలపై దాడి చేయడానికే సరిపోయింది అని ఈటల అన్నారు. కాగ్ రిపోర్ట్ పై ఈటల కామెంట్స్: బడ్జెట్ పెరుగుతుంది? కేటాయింపులు తగ్గుతున్నాయి.. కొన్ని శాఖలకు కేటాయింపులు ఉన్నా.. ఖర్చు కూడా చేయడం లేదు.. దీపం ఆరిపోయే ముందు వెలుగెక్కువ అన్నట్లుగా ఉంది ప్రభుత్వ తీరు.. రైతులు తీసుకున్న రుణాలకు 13 నుంచి 14 వేల కోట్ల రూపాయలు వడ్డీ పెరిగిపోయింది.. ప్రభుత్వ ఖర్చులలో ప్రతినెలా నాలుగు వేల కోట్ల రూపాయలు వడ్డీలకు పోతుంది.. నాలుగు కోట్ల రూపాయలు ఉద్యోగుల జీతభత్యాలకే పోతుంది.. భూములు అమ్మవద్దని ఆనాడు అసెంబ్లీలో మేమే ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశాం.. కానీ.. ఈ రోజు భూములు ఎలా అమ్ముతున్నారు.. రియల్ ఎస్టేట్ పడిపోలేదని చెప్పడానికి ఎకరా వంద కోట్లు అని ప్రచారం చేసుకోవడానికి చేస్తున్నారు.. ఫార్మా కంపెనీలకు భూముల సేకరణకు ఎంత పరిహారం ఇస్తున్నారు అని ఈటల రాజేందర్ ప్రశ్నించారు.

# కలవరపెడుతున్న కరోనా కొత్త వేరియంట్

(మొదటిపేజీ తరువాయి)
మొదటి కేసును గుర్తించామని, బ్రిటన్‌లో ఇది వేగంగా వ్యాపిస్తోందని, కేసుల సంఖ్య పెరుగుతోందని ప్రకటించింది యూకే హెల్త్ సెక్యూరిటీ ఏజెన్సీ. బ్రిటన్‌లో గత వారం రోజుల్లోనే 8 వేలమంది ఆస్పత్రుల్లో చేరారని, వీరిలో 398 కొత్త వేరియంట్ ఇన్ఫెక్షన్స్ గుర్తించామని చెబుతోంది డబ్ల్యు.హెచ్.ఓ. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఏసియాలో కోవిడ్ కేసులు పెరగడంతో స్క్రీనింగ్ మీద దృష్టి పెట్టింది యూకే. ఇందులో భాగంగానే ఈ కొత్త వేరియంట్ బైటపడింది. నమోదౌతున్న ప్రతీ ఏడు కోవిడ్ కేసుల్లో ఒకటి ఎరిస్ వేరియంటేనని, ఇది ఆషామాషీ వేరియంట్ కాదని, బ్రిటన్‌ని దెబ్బతీసిన ప్రమాదకర వేరియంట్లలో ఎరిస్ రెండోదని చెబుతోంది యూకే హెల్త్ విభాగం. అటు.. బ్రిటన్‌కి ఇరుగుపొరుగు దేశాల్లో, ముఖ్యంగా మిడిలీస్ట్ కంట్రీస్‌లో హైఅలర్ట్ మొదలైంది. యూఎస్, జపాన్ దేశాల్లో ఇప్పటికే కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. జూలై 3న ఎరిస్ వేరియంట్ మొదటి కేసు నమోదైంది. బ్రిటన్‌లో ఎరిస్ వేరియంట్ వేగంగా వ్యాపిస్తోంది. అత్యంత ప్రమాదకర వేరియంట్లలో ఎరిస్ రెండోది. బ్రిటన్‌కి ఇరుగుపొరుగు దేశాల్లో హైఎలర్ట్ జారీ చేశారు. ఇమ్యూనిటీ పెంచుకోవాలి' అని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి ఇండియాక్కూడా మరోసారి కోవిడ్ ముప్పు తప్పదా? కొత్త వేవ్ ముంచుకొచ్చే ప్రమాదం ఎంతవరకుంది అనే చర్చ ఇక్కడ కూడా మొదలైంది. అధికపక్షం జనాభా వ్యాక్సినేషన్ పూర్తి చేసుకుని కావల్సినంత ఇమ్యూనిటీ సాధించారని, ఒకవేళ ఎరిస్ వేరియంట్ ఇండియాకు చేరినా.. దాని వ్యాప్తి భయపడాల్సినంత స్థాయిలో ఉండబోదని చెబుతున్నారు. ఇమ్యూనిటీ మేనేజ్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని కూడా హెచ్చరిస్తున్నారు. 'ఇప్పటివరకైతే కొత్త వేరియంట్ ఇండియాకి చేరుకోలేదు. మనదాకా వచ్చే ఛాన్స్ కూడా లేదనేది ఎక్స్‌పర్ట్స్ మాట. కానీ? ముందుజాగ్రత్తగా కోవిడ్ గైడ్‌లైన్స్ పాటించాల్సిందే అనే హెచ్చరికలున్నాయి. ఇన్‌ఫెక్షన్ సోకకుండా బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించాలనే ఆదేశాలు త్వరలో వచ్చినా రావొచ్చు' అని అమెరికాకు చెందిన డా. శరత్ అద్దంకి తెలిపారు.

## సంపాదకీయం

# చీతా ప్రాజెక్టుకు అడ్డంకులు

ప్రాజెక్టు చీతా అంశంపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఊరటనిచ్చింది. భారత్ లో చీతాలను తిరిగి ప్రవేశపెట్టేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నించేందుకు ఎలాంటి కారణం లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు సమర్థించింది. కునో నేషనల్ పార్క్‌లో చీతాల మనుగడ సాధ్యమేనా?.. ప్రాజెక్ట్ చీతాను కేంద్రం ప్రారంభించినప్పుడు చాలామంది మేధావులు వ్యక్తం వేసిన ప్రశ్న ఇది. అయితే.. కేంద్రం ఈ ప్రాజెక్టును సవాల్‌గా తీసుకుంది. ప్రతిష్టాత్మకంగా దాదాపు వంద కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోంది. సౌతాఫ్రికా, నమీబియా నుంచి భారత్‌కు రప్పించిన 20 చీతాలను నెలల పాటు పర్యవేక్షించి.. కునోలోకి వదిలింది. కానీ, అంతా సవ్యంగా సాగిపోతుందనుకున్న సమయంలో.. నెల వ్యవధిలోనే రెండు చీతాలు కన్నుమూశాయి. ఆ రెండూ ఇన్‌ఫెక్షన్‌లతోనే కన్నుమూశాయన్న అటవీ అధికారులు ప్రకటించారు. అయితే ఈ పరిస్థితిపై సౌతాఫ్రికా అటవీ శాఖ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాఖ్యలపైనే కునో అధికారులు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. నమీబియా, దక్షిణాఫ్రికా దేశాల నుంచి తీసుకొచ్చిన 20 చీతా లాల్లో ఆరు చీతాలతో పాటు మూడు కూనలు మృతి చెందాయి. దీనిపై దాఖలైన పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వ చర్యలను సమర్థిస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేసింది. 1952 తర్వాత భారత్ లో చీతాలు అంతరించిపోయినట్లు ప్రకటించిన తర్వాత సెప్టెంబర్లో కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు చీతా ను ప్రారంభించింది. ఇందులో భాగంగా రెండు విడతల్లో నమీబియా, దక్షిణాఫ్రికా దేశాల నుండి 20 చీతా లను భారత్ కు తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే నమీబియా నుంచి తీసుకొచ్చిన సాశా అనే ఆడ చీతా మార్చి 27న దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన ఉదయ్ అనే మగ చీతా ఏప్రిల్ 23న మృతి చెందాయి. దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన చీతా ల్లో ఒకటైన ఆడ చీతా దక్ష మే 9న మృతి చెందింది. అదే నెలలో జ్వాలా అనే చీతా కు పుట్టిన నాలుగు కోణాల్లో మూడు చనిపోయాయి. ఈ నెలలో మూడు మరణాలతో కలిపి మొత్తం వీటి మరణాల సంఖ్య 9 కి చేరింది. మరోవైపు చీతా ల కదలికలను గుర్తించేందుకు వాటి మెడలో వేసిన రేడియో కాలర్ల వల్లే అవి మృతి చెందుతున్నాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల వాటిని కూడా తొలగించారు.

అయినా ఇటీవల మరో చీతా ప్రాణాలు కోల్పోవడంతో సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో వీటి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందంటూ కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు న్యాయస్థానం చీతా లను భారత్ లో తిరిగి ప్రవేశపెట్టేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను న్యాయస్థానం సమర్థించింది. అయితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణుల సూచనలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ప్రాజెక్టు చీతా కు సంబంధించి తీవ్ర కసరత్తు చేశామని, ప్రతి ఏటా 12-14 చీతా లను దేశానికి తీసుకొచ్చేందుకు ప్రాణాలికలు రచించామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు ఆయా దేశాలతో ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నట్లు సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం వివరించింది.

కొన్ని సమస్యలు వస్తున్న మాట వాస్తవమేనని, అయితే వాటన్నింటినీ అదిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. వాటితో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అయితే ప్రస్తుతం చీతా లు మృతి చెందుతున్న పరిణామాల మధ్య కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు. సౌతాఫ్రికా ఫారెస్ట్, ఫిషరీస్, ఎన్విరాన్‌మెంట్ విభాగం మధ్యప్రదేశ్ కునో నేషనల్ పార్క్‌లో సంభవించిన చీతాల మరణంపై స్పందించారు. ఈ ప్రాజెక్టును చేపట్టినప్పుడే.. మరణాలను తాము ఊహించామని వారంటున్నారు. అందుకు వాతావరణ మార్పులే ప్రధాన కారణంగా భావించవచ్చని చెబుతున్నారు. ప్రాజెక్ట్ చీతాలో భాగంగా.. నమీబియా, సౌతాఫ్రికా నుంచి భారత్ చీతాలను తెప్పించుకుంది. ఆ రీలొకేటింగ్ టైంలోనే మేం ఈ పరిస్థితిని అంచనా వేశాం. సాధారణంగా వాతావరణ మార్పులను ఒక్కోసారి అవి తట్టుకోలేవు. విపరీతమైన మార్పుల కారణంగానే అవి చనిపోవచ్చు. అలా కునోలో చీతాల మరణాలు మేం ఊహించినవే అని తెలిపారు.

అయితే ఏదైనా జబ్బు పడి అవి చనిపోతున్నాయా?, సాధారణ ఇన్‌ఫెక్షన్‌లతోనే చనిపోతున్నాయా? అనేద ఇంకా తేలాల్సి ఉంది. భారత్ చేపట్టిన ప్రాజెక్ట్ చీతా.. ఒక రిస్కీ ఆపరేషన్. పైగా ప్రస్తుతం అది ఇంకా క్రిటికల్ ఫేజ్‌కు చేరుకుంది. ఎందుకంటే చీతాలు ఇప్పుడు పరిమిత ప్రాంతంలో లేవు. అవి సంచరించే సరిహద్దులు పెరిగిపోయాయి. కాబట్టి, ఎప్పటికప్పుడు వాటి ఆరోగ్యం గురించి పర్యవేక్షించడం వాటి సంరక్షకులకు కష్టతరంగా మారొచ్చు. అదే విధంగా వాటికి అయ్యే గాయాల్ని కూడా పర్యవేక్షించడం కష్టమే అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సౌతాఫ్రికాలో చీతాలను భారీ ఎన్‌క్లోజర్‌లో ఉంచుతారు.

రోజుకు రెండుసార్లు వాటిని పరిశీలిస్తారు. ఒకవేళ అడవిలో ఉంటే.. బృందాలు వాటిని అనుసరిస్తూ ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షిస్తుంటాయి. కానీ, కునో ప్రాంతం ఫెన్సింగ్ రక్షిత ప్రాంతం కాదు. అంతేకాదు.. చీతాలకు పోటీగా చిరుతలు, తోడేళ్లు, ఎలుగు బంట్లు, హైనాలు సంచరిస్తుంటాయి. వాటి నుంచి కూడా ముప్పు పొంచి ఉండొచ్చు. వివిధ రకాల వాతావరణాల్లో వివిధ రకాల జంతువులను పరిరక్షించడం అతి పెద్ద సవాల్. చీతాల సంరక్షణ మరింత సంక్లిష్టంతో కూడుకున్నది. ఆవాసానికి అలవాటుపడితేనే అవి మనుగడ సాగించగలవని, అప్పటి వరకు వాటిని దగ్గరగా పర్యవేక్షించడమే మంచిదని కునో అధికారులకు సౌతాఫ్రికా అటవీ అధికారులు సూచిస్తున్నారు.

## ఏపీ ప్రభుత్వంపై చిరంజీవి మండిపాటు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : మేగా స్టార్ చిరంజీవికి కోపమొచ్చింది, ఏపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. మీ ప్రతాపం సినీ పరిశ్రమపై కాదు.. ప్రత్యేక హోదా, ప్రాజెక్టుల పై చూపండని ఏపీ ప్రభుత్వ తీరుపై మెగాస్టార్ చిరంజీవి ఆగ్రహం వ్యక్తం చేసారు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలాగా సినీ పరిశ్రమపై పడ్డారు. ప్రత్యేక హోదా, ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టండి. ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలు, ఉద్యోగ, ఉపాధిపై దృష్టి పెట్టండి. ఉద్యోగ, ఉపాధిపై దృష్టి పెట్టినప్పుడే ప్రజలు మెచ్చుకుంటారని అన్నారు. వాల్తేరు వీరయ్య 200 రోజుల ఈవెంట్లో మెగాస్టార్ చిరంజీవి కీలక వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.

# అల్ఫోర్స్ లో అట్టహాసంగ కెప్టెన్స్,వైస్ కెప్టెన్స్ ప్రమాణ స్వీకారం

కరీంనగర్ -పభాత సూర్యుడు : ద్యార్థులకు భాధ్యతపట్ల చక్కటి అవగాహన కల్పించాలని, భాధ్యతలను నిర్వర్తించే విధానాలను తెలియపర్చాలని తద్వారా సమాజంలో ఉత్తమంగా ఉంచవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్ట్స్ ప్రాంగణంలో వివిధ విభాగాల కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన హాజరై య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఇటీవల కాలంలో ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించడం జరిగినదని తెలిపారు. ఎన్నికలు నిర్వహించడం వలన సంక్షేమం జరుగుతుందని, ప్రజలకు కావల్సిన అవసరాలను సమకూర్చవచ్చునని అభిప్రాయపడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికలకు ప్రత్యేకత ఉన్నదని, ప్రజలకు ఆప న్నహస్తంగా ఉంటుందని తెలుపుతూ ఎన్నికలు పెద్దన్న పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజల మనోభావాలకు ధర్పణం అని చెప్పారు. విద్యార్థులకు ప్రాథమిక దశనుండే వివిధ భాధ్యతల పట్ల చక్కటి అవగాహన కల్పించాలని, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికై ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఈ సంవత్సరం సైతం రెట్టింపైన ఉత్సాహంతో పాఠశాలలోని వివిధ విభాగాల కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్‌కు ఎన్నికలు, ఎన్నికల వాతావరణం కల్పించే విధంగా నిర్వ హించడం కొనసాగినదని చెప్పారు. పాఠశాలలోని "తేజస్", "సరస్", "ధృవ" "లక్ష్య" విభాగాలకు బాలబాలికలకు వేరు వేరుగా ఎన్నికల పోటీలను నిర్వహించడం జరిగినదని తెలిపారు. విద్యార్థుల్లో నూతన ఉ త్తేజాన్ని నింపడానికై, శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికై ప్రత్యేకంగా సామాజిక స్పృహను కల్పించడానికై ఎన్నికలను అట్టహాసంగా కరోనా ప్రోటోకాల్ను పాటిస్తూ నిర్వహించడం జరిగినదని చెప్పారు. ప్రమాణస్వీకారోత్సవంలో భాగంగా విద్యార్థులచేత భాధ్యతలను పాఠశాలకు అనుగుణంగా, తోటి విద్యార్థుల్లో సోధర భావం పెంపొందించే విధంగా స్నేహ పూర్వకమైన వాతావర్ణాన్ని ఏర్పాటు చేసి ఆదర్శంగా విధులను నిర్వర్తిస్తామని విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. ప్రారంభానికి ముందు డా. వి నరేందర్ రెడ్డి విద్యార్థులకు నాయకత్వ విశిష్టతను, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధానాలను స్పష్టంగా తెలియజేశారు. పాఠశాలలోని "తేజస్", "సరస్", "ధృవ" , "లక్ష్య" విద్యార్థులు నాయకత్వ లక్షణాలను బలపర్చడానికై ప్రత్యేక నాటికను రూపొందించి ప్రదర్శించి సభికులను ఆహుతులను చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం తోటి విద్యార్థులు ఎన్నికైన వారికి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా బాద్రపు శంకర్



కమాన్ పూర్ - ప్రభాతసూర్యుడు : కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా రొంపి కుంట గ్రామానికి చెందిన బాద్రపు శంకర్ ను నియమిస్తూ మండల శాఖ అధ్యక్షుడు వైనాల రాజు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఏఐసీసీసెక్రెటరీ మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు రొంపికుంట లో కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు కమాన్ పూర్ మండలం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా బాద్రపు శంకర్ ను నియ మించడం జరిగింది. కాగా తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగి ంచినందుకు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గా శ్రీధర్ బాబును అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైనాల రాజు లకు శంకర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటకం రవీందర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి భూనీపెల్లి రాజయ్య, ఉప సర్పంచ్ గుమ్మడి సతీష్, గ్రామ శాఖ అధ్యక్షులు కోల నరేందర్ , మాజి అధ్యక్షులు గుమ్మడి శ్రీనివాస్ , మాజీ సర్పంచ్ కమ్మగొని మల్లయ్య, కోల నర్సాగౌడ్ వార్డు మెంబర్ సంజీవ్, నరసయ్య, మల్లేష్, సీనియర్ నాయకులు కోల మల్లయ్య గౌడ్ , కటకం లింగయ్య మాజి ఉపసర్పంచ్ కొండి శంకరయ్య మాజి ఎంపిటిసి కొమురయ్య, గాండ్ల రాజయ్య గుమ్మడి వెంకటేష్, వడ్లకొండ రాజయ్య, దాసరి గట్టయ్య, చోపరి శేకర్, బూసా తిరుపతి, బొజ్జ సతీష్, మామిడి రాజు, యూసుఫ్ లల్లు, పెండ్యాల రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

## నిషేదిత ఈ సిగరేట్ల విక్రయ ముఠా అరెస్టు

సైబరాబాద్ - ప్రభాతసూర్యుడు: విచ్చలవిడిగా నిషేదిత ఈ సిగరేట్లను విక్రయిస్తున్న ముఠా ను సైబరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసారు. ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులను ,పబ్ లను టార్గెట్ గా చేసుకుని నిషేదిత సిగరేట్లను ముఠా అమ్ముతున్నట్లు గుర్తించారు. నిందితుల వద్ద నుండి 2 లక్షల విలువ చేసే ఈ సిగరేట్లు స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ డీసీపీ సందీప్ రావు మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ - సిగరెట్ లు విక్ర యిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నాం. ఈ సిగరెట్లు విక్రయిస్తున్న మొత్తం పది మందిని గుర్తించాం. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా మరో నలుగురు పరారీలో ఉన్నారని అన్నారు. నిందితుల వద్ద నుండి రెండు లక్షల రూపాయలు విలువ చేసే 99 డిస్పోసల్ ఈ - సిగరెట్లు,05 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. ఈ-సిగరెట్లు 2019 లో బ్యాన్ చెయ్యడం జరిగింది. ఈ సిగరెట్లు విక్రయించినా, కొనుగోలు చేసినా చట్ట పరమైన చర్యలు తప్పవని అయన అన్నారు.

## లేడీస్ హస్టల్ లో షార్ట్ సర్క్యూట్ విద్యార్ధినీలు క్షేమం

ములుగు - ప్రభాతసూర్యుడు: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ కస్తూర్బా లేడీస్ హాస్టల్ లో సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఘటనలో అక్కడి విద్యార్థుల బట్టలు, పెట్టెలు, పుస్తకాలు కాలిపోయాయి. హాస్టల్లో మెయిన్ హాల్లో స్విచ్ బోర్డులో ఉన్న వైరింగ్ కాలిపోవడంతో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది స్థానికులతో కలిసి మంటలను ఆర్పేశారు. విద్యార్థులు వేరే హాల్లో ఉండడంతో ప్రమాదం తప్పింది.

## సాగర్ ఎడమ కాలువకు భారీ రంధ్రం

నల్గొండ - ప్రభాతసూర్యుడు: నల్లగొండ జిల్లా పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువకు భారీ రంధ్రం పడింది. త్రిపురారం మండలం, పెద్దదేవులపల్లి రిజర్వాయర్ సమీపంలో.. కాలువ కట్టకు ఉన్న డిస్ట్రిబ్యూటరీ తూము దగ్గర దాదాపు ఏడెనిమిది అడుగుల లోతు, ఐదు అడుగుల వెడల్పుతో రంధ్రం పడటాన్ని స్తానిక రైతులు గమనించి.. ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి.. దానిని పూడ్చేందుకు సదరు అధికారులు చొరవ చూపట్లేదని స్తానిక రైతులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల కిందట.. పాలేరు రిజర్వాయర్ కు తాగు నీటిని విడుదల చేసిన సమయంలో.. డెయిరీ ఫాం తూము వద్ద పడిన రంధ్రం పడిందని.. వారం రోజులు అవుతున్నా ఎన్నెస్పీ అధికారులు కనీసం పట్టించుకొన్న దాఖలాలు లేవన్నారు. మరోమారు.. ఎడమ కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తే.. కాలువ కట్ట తెగిపోయే ప్రమాదం ఉందంటున్నారు. అదే జరిగితే.. నాలుగు మండలాల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో చిరు వ్యాపారి ఆత్మహత్య

నిర్మల్ - ప్రభాతసూర్యుడు: బైంసా పట్టణంలోని గాంధీ గంజ్ లో మంగళవారం ఓ చిరు వ్యాపారి ఎస్. మల్లేష్ ( 50) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది.. ఈ మేరకు కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మైనారిటీల అంశాలపై మంత్రుల భేటీ

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు: అసెంబ్లీలో సీఎం కేసీఆర్ హామీ మేరకు మైనార్టీల వివిధ సమస్యలపై చర్చించేందుకు సచివాలయంలో మంత్రులు హరీశ్ రావు, మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస యాదవ్ సమావేశం అయ్యారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, సీఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మైనారిటీ సెక్రెటరీ ఉమర్ జలీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. మైనారిటీలకు లక్ష ఆర్థిక సాయం, ఓవర్ సీస్ స్కాలర్ షిప్స్, స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్, మౌజం సంఖ్య పెంపు, క్రిస్టియన్ స్మశాన వాటికలు, ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ..రాష్ట్రంలోని ఇతర వర్గాలతో సమానంగా మైనారిటీ వర్గాల సంక్షేమంతోపాటు అన్ని వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. స్మశాన వాటికలకు 125 ఎకరాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్‌లు-మౌజిన్‌ల సంఖ్య పెంపు వంటి రెండు హామీలను ఇప్పటికే ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. మైనార్టీల సంక్షేమంలో భాగంగా సీఎం కేసీఆర్ ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సాయం కార్యక్రమాన్ని అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మొదటి దశలో భాగంగా ఎంపిక చేసిన 10 వేల మంది లబ్ధిదారులకు ఈనెల 16 నుండి లక్ష రూపాయల చెక్కుల పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు, ఇప్పటికే కేటాయించిన 270 కోట్లకు అదనంగా, మరో 130 కోట్లు కేటాయించి మొత్తం 400 కోట్లు ఈ కార్యక్రమం అమలుకు కేటాయించాలని ఆర్థిక శాఖను మంత్రి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో జనాభా దామాషా ప్రకారం ఆర్థిక సహాయం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగాలని చెప్పారు. మైనారిటీల జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలపై మరింత దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమంపై అధికారులతో సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రాష్ట్రంలో శ్మశాన వాటికలు, ఈద్‌గాల భూముల కోసం వచ్చిన మొత్తం వినతులను క్రోడీకరించాలని, ఈ దిశగా పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఒవైసీ పహాడీ షరీఫ్ దర్గా ర్యాంప్ పనులు, దర్గా బర్హనా షా అద్దెల సవరణ, క్రిస్టియన్ స్మశాన వాటికలు, ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్, గ్రాంట్ ఇన్ ఎయిడ్ మరియు ఇతర పనులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి హరీష్ రావు ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి పనులు త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని అధికారులను కోరారు. షాదీ ముబారక్‌కు సంబంధించి, ప్రక్రియను వేగవంతం చేసి, లబ్ధిదారులకు వెంటనే ఉపశమన సొమ్ము అందేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## ఓయూలో విద్యార్థుల ఆందోళన, అరెస్ట్

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్దులు అందోళనకు దిగారు. గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వెయ్యాలని చలో ప్రగతి భవన్ ముట్టడికి బయలుదేరారు. వారిని అడ్డుకున్న పోలీసులు, అరెస్టు చేసి ఓయుపిఎస్ కు తరలించారు. ఒకే నెలలో అన్ని పరీక్షలు నిర్వహించడం వల్ల తీవ్రంగా నష్టపోతామని, పరీక్షకు పరీక్షకు మధ్య సమయం కావాలని విద్యార్థులు డిమాండ్ చేసారు.

### నోటరీ భూముల క్రమబద్ధీకరణకు
## అక్టోబర్ 31 వరకు గడువు
**- జిల్లా కలెక్టర్ హరీష్**



**రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు :** గతంలో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా కేవలం నోటరీ ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయేతర భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినందున అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరీష్ సూచించారు. నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల పరిధిలో నోటరీ భూములు కలిగి ఉన్న వారు మీ-సేవ ద్వారా అక్టోబర్ 31 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ 84ను అనుసరిస్తూ, 125 గజాల లోపు స్థలం కలిగి ఉన్న వారి నోటరీ ప్లాట్లను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా రెగ్యులరైజెషన్ చేయడం జరుగుతుందని, 125 గజాలు దాటిన వాటికి ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ వ్యాల్యూ ప్రకారం స్టాంప్ డ్యూటీ, రూ.5 పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు. మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసే సమయంలో నోటరీ డాక్యుమెంట్ తో పాటు ఆ భూమికి సంబంధించిన లింక్ డాక్యూమెంట్లు, ఆస్తి పన్ను, కరెంటు బిల్లు, నీటి పన్ను చెల్లించిన రసీదులు, ఇతర ఆధారాలు ఉంటే వాటిని జత చేయాలని సూచించారు. నోటరీ భూముల క్రమబద్ధీకరణ వల్ల పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయని, సులభంగా క్రయ విక్రయాలు జరుపుకోవచ్చని, బ్యాంకు ద్వారా రుణాలు పొందే వెసులుబాటు ఉంటుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటరీ ద్వారా కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణకు అర్హులైన వారందరూ నిర్ణీత గడువు లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ హరీష్ సూచించారు.

## పరిశుభ్రతతోనే కండ్ల కలక నివారించవచ్చు
**- డాక్టర్ సృజన**



**కుత్బుల్లాపూర్ - ప్రభాతసూర్యుడు:** వర్షాకాలపు సీజన్లో వచ్చే వ్యాధుల్లో కండ్లకలక ఒకటి. ఎవరికైనా కండ్ల కలక వచ్చి ఉంటే ముందుగా కండ్ల అద్దాలు ధరించి దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని కుత్బుల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సృజన తెలిపారు. ఈ వ్యాధి గాలి ద్వారా కూడా సోకుతుందని సాధారణంగా చేతులు ఎప్పుడూ కడుక్కుంటూ ఉండాలని పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిలువ ఉండకుండా చూసుకోవాలని ఆమె తెలియజేశారు. కుత్బుల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు సంబంధించిన ఏరియా లో ఆశ వర్కర్లు సర్వే చేసి వ్యాధి లక్షణాలున్న వారిని ఆసుపత్రికి తీసుకొస్తారు. ఈ వ్యాధి తో ఎవరు భయపడవలసిన అవసరం లేదని తగు జాగ్రత్తలు పాటిస్తే ఎనిమిది నుంచి పది రోజుల్లో తగ్గుతుందని డాక్టర్ సృజన తెలిపారు.

## ఐఐడి హైదరాబాద్ లో విద్యార్థిని ఆత్మహత్య



**సంగారెడ్డి - ప్రభాతసూర్యుడు :** ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ లో మరోసారి విషాదం నెలకొంది. క్యాంపస్ లో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. క్యాంపస్ రూమ్ లో విద్యార్థిని మమైతా నాయక్ (21) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి కార్తీక్ సూసైడ్ ఘటన మరువక ముందే మరో ఘటన జరిగింది. గత నెల 17 న కార్తీక్ విశాఖపట్నం బీచ్ లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏడాది వ్యవధిలో నలుగురు ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే మొదటిసారి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. నా చావుకు ఎవరూ కారణం కాదు. మానసిక ఒత్తిడికి గురవుతున్నానని మృతురాలు లేఖ రాసినట్లు సమాచారం.

## ఎంతెంత దూరం

- లాటరీ ద్వారా ఎంపీకల చేసి మూడు నెలలు దాటిపాయే...
- ఇంకా కొనసాగుతున్న మరమ్మత్తులు అర్హులకు డబుల్ బెడ్ రూమ్ దక్కేనా
- ఆందోళన బాట పట్టిన లబ్ధిదారులు



**పెద్దపల్లి -ప్రభాతసూర్యుడు :** తొమ్మిదేళ్ల బిఆర్ ఎస్ పాలనలో అర్హులైన నిరుపేదలకు కేటాయించిన రెండు పడకల గదుల ఇల్లు ఇప్పటికి ఇంకా వారి దరికి చేరలేదు... కళ్ళకు దగ్గరగా కనిపిస్తున్న కాళ్లకు మాత్రం దూరంగానే ఉంది. ఇప్పటికీ రెండుసార్లు అర్హులని ఎంపిక చేసినా పంపిణీ విషయంలో మాత్రం స్తబ్దత కొనసాగుతూనే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించి న దశాబ్ది ఉత్సవాలలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కొద్దిమంది లబ్ధిదారులకు ఇచ్చినట్టే ఇచ్చి పత్రాలను ఎందుకంటే నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయని ఇంకా కొన్ని మరమ్మత్తు లు జరుగుతున్న దృష్ట్యా అందరికీ ఒకేసారి పత్రాలను ఇచ్చి గృహప్రవేశం చేయిస్తారానే ఆలోచనలో ఉన్నట్టుగా తెలిపారు. అర్హులని మరీ లాటరీ ద్వారా ఎంపిక చేసి వారికి నెంబర్లు కూడా కేటాయించారు. ఇప్పటికీ మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జూన్ 24న పలువురు లబ్ధిదారులు కొత్తగా వచ్చిన కలెక్టర్ కు ప్రజావాణి లో వినతిపత్రం అందజేశారు. మళ్లీ రెండు రోజుల తర్వాత ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిని కలిసి లబ్ధిదారులు విన్నవించుకున్నారు. అయితే ఇళ్ల నిర్మాణాలల్లో కొన్ని మరమ్మత్తులు జరుగుతున్నా యని వాటిని త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారన్నారు. బిజెపి పార్టీ లబ్దిదారు లతో కలిసి డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. అయితే లబ్ధిదారులు ఎమ్మెల్యేని కలిసి 15 రోజులు దాటిన ఇంకా ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు భారీ ఎత్తున సోమవారం మరోసారి కలెక్టర్ కార్యాల యం ముందు ధర్నా నిర్వహించి, ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఎలక్షన్లకు సమయం దగ్గర పడు తుండటంతో లబ్ధిదారుల్లో భయం పట్టుకున్నది. ప్రతి పక్షాల నాయకులను కలవడమే మార్గంగా ఎంచు కున్నట్టుగా వారు పేర్కొంటున్నా రు.ఫస్ట్ స్టేజ్ లో 1100 మందిని, రెండో స్టేజ్ లో 550 మందిని, మూడో స్టేజ్ లో 484 మందిని అధికారులు సెలక్ట్ చేశారు. మరి వీళ్ళయినా వుంటారో పోతారో, ఇంకా అర్హులైన వారిని కొంత మందిని ఎంపిక చేసేదిగా ఉందని అధికారు లు పేర్కొంటున్నారు. మరి ఆ కోవలో లబ్ధిదారు లకు పంపిణీ చేయడం ఆపి వేశారా లేక మిగతా అర్హులను కూడా ఎంపిక చేసి అందరికి ఒకేసారి పంపిణి చేస్తారా అనేది తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు గృహప్రవేశం చేసే యోగం దక్కుతుందో లేదోననే భయాందోళనలో ఉన్నారు. కొన్ని జిల్లాలో పంపిణీ చేసిన కూడా, ఇక్కడ మాత్రం వారి బాధలు ఎవరు పట్టించుకునే వారు లేకుండా పోయారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పంపిణీ పూర్తికాకముందే గృహలక్ష్మి అంటూ ప్రభుత్వం కొత్త పథకం తీసుకు వచ్చింది. ఒకవేళ డబుల్ బెడ్ ఇల్లు రాకపోయినా గృహలక్ష్మి దరఖాస్తు చేసుకుందా మంటే సెలక్షన్ లో వచ్చిన వారి పరిస్థితి అగమ్య గోచరంగ మారింది. కాగా అధికారులు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణాల సర్వేలో చాలామంది అనర్హులని ఎంపిక చేశారని పలువు రు ఆరోపిస్తు న్నారు. ఏది ఏమైనా డబల్ బెడ్ రూమ్ లు అర్హులైన లబ్ధిదారులకు చేరేవరకు అర చేతిలో వైకుంఠమే అవుతుందేమో వేచి చూడాలి మరి.

### గద్దర్ మృతి పట్ల
## సంతాపం వ్యక్తం చేసిన ఎంపీపీ

**కమాన్ పూర్ - ప్రభాతసూర్యుడు:**
గద్దర్ మృతి పట్ల రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు.తెలంగాణ పాటకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ప్రజా వాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో తన పాటద్వారా పల్లె పల్లెనా భావజాలవ్యాప్తి చేసిన గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) రామగిరి మండల ఎంపీపీ ఆరెల్లి దేవక్క-కొమురయ్య గౌడ్ తీవ్రగ్ర్భ్భాంతి చెందారు. వారి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. తెలంగాణ కోసం తన ఆట పాటలతో ప్రజల్లో స్వరాష్ట్ర చైతన్యాన్ని రగిలించిన గద్దర్ ప్రజాయుద్ధనౌకగా ప్రజల హృదయాల్లో,ప్రజలకోసం తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసి ప్రజలకోసమే బతికాడని తెలిపారు.సాధారణ బుర్రకథ కళాకారుడుగా ప్రారంభమైన గద్దర్ కళాజీవితం, విప్లవ రాజకీయాలతో మమేకమై, అనంతర కాలంలో తెలంగాణ సాధన కోసం సాగిన ఉద్యమంలో సాంస్కృతిక పోరాటంలో ఉన్నతస్థాయికి చేరిందన్నారు. కవిగా గద్దర్ ప్రజా కళలకు, ఉద్యమాలకు చేసిన సేవలుమరుపురానివని, వారు లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. ప్రజా కళాకారులకు కవులకు మరణం ఉండదని, ప్రజాకళలు వర్ధిల్లినంతకాలం ఆయన పేరు అజరామరంగా నిలిచి ఉంటుందని తెలిపారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ఆరెల్లి దేవక్క-కొమురయ్య గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

**కమాన్ పూర్ - ప్రభాతసూర్యుడు:**
కమాన్ పూర్ మండలం రొంపి కుంటలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు.మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు.పలు వైద్యశాలల్లో చికిత్స చేయించుకొని ఆర్థిక సహాయం కొరకు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం మంథని నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ద్వారా సిఫార్సు చేసుకోగా మంథని ఎమ్మెల్యే శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారుడు రొంపికుంట గ్రామానికి చెందిన మానుపాటి కార్తీక్ కి 21,000 రూపాయల చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. కమాన్ పూర్ మండలము రొంపికుంట గ్రామములో లబ్ధిదారులకు అందజేసిన కాంగ్రెస్ నాయకులుఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటకం రవీందర్,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి భూనీపెల్లి రాజయ్య, ఉప సర్పంచ్ గుమ్మడి సతీష్, గ్రామ శాఖ అధ్యక్షులు కోల నరేందర్ , మాజి అధ్యక్షులు గుమ్మడి శ్రీనివాస్ , మాజీ సర్పంచ్ కమ్మగొని మల్లయ్య, కోల నర్సాగౌడ్ వార్డు మెంబర్ సంజీవ్, నరసయ్య, మల్లేష్, సీనియర్ నాయకులు కోల మల్లయ్య గౌడ్ , కటకం లింగయ్య మాజి ఉపసర్పంచ్ కొండి శంకరయ్య మాజి ఎంపిటిసి కొమురయ్య, గాండ్ల రాజయ్య గుమ్మడి వెంకటేష్, వడ్లకొండ రాజయ్య,దాసరి గట్టయ్య, చోపరి శేకర్, బూసా తిరుపతి,బొజ్జ సతీష్,మామిడి రాజు,యూసుఫ్ లల్లు,పెండ్యాల రాజు,శ్రీనివాస్ ఉన్నారు.

## ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

**పెద్దపల్లి - ప్రభాతసూర్యుడు :**
ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కటుకూరి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐ ఆవరణలో జిల్లాలోని ఆశా వర్కర్లతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షురాలు అనవేన స్వరూప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైన శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, 17యేళ్ళుగా జీతమెంతో తెలియకుండానే పని చేస్తున్నా ఆశా వర్కర్ల సంక్షేమం గురించి ప్రభుత్వం పట్టించుకోవాల న్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అధిక పనిభారం తగ్గించాలని, ఆరోగ్య భీమా అమలు సౌకర్యం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆశావర్కర్ల సమస్యలపై చర్చించాలన్నారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి ఆశా కార్యకర్తలు పని చేశారని గుర్తు చేశారు. ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, జిఎన్ఎం పోస్టులను అర్హత గల ఆశా వర్కర్లతో భర్తీ చేయాలని, పెన్షన్, రిటైరుమెంటు సదుపాయాలు, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్లు శివాల జ్యోతి, నెరువట్ల రజిత, లక్ష్మి, మమత, రాజేశ్వరి, కరుణ, పద్మ, స్వప్న శోభ, సరోజన, లక్ష్మి, జ్యోత్స్న, ప్రమీల, రమాదేవి, రజిత, శారధ, తదితరులు పాల్గొన్నారు.

## పిజ్జా ఇచ్చేందుకు వెళ్లి...

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు:**
అర్ధరాత్రి పూట లవర్ కి పిజ్జా ఇవ్వడానికి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు ఓ యువకుడు. హైదరాబాద్ బోరబండ పరిధిలో ఈ విషాద ఘటన వెలుగు చూసింది. మహమ్మద్ షోయబ్ (19) అనే యువకుడు బోరబండలోని ఓ బేకరీలో పని చేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో షోయబ్ తన లవర్ కి పిజ్జా తీసుకుని ఆమె ఇంటికి వెళ్లాడు. పిజ్జాను లవర్ కి ఇచ్చిన తరువాత ఇద్దరు మెడ మీద కూర్చుని మాట్లాడుకుంటుండగా యువతి కుటుంబ సభ్యులు రావడం గమనించిన యువకుడు నాలుగు అంతస్తుల పై నుంచి కిందకి దూకేశాడు.తీవ్ర గాయాల పాలైన యువకుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. యువకుని పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు సోమవారం మృతి చెందాడు.మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పిజ్జా ఇచ్చేందుకు షోయబ్ తమ ఇంటికి వచ్చాడని, ఇంతలో తాను రావడంతో ఆందోళనకు గురై భవనం పైనుంచి దూకేశాడని యువతి తండ్రి పోలీసులకు తెలిపాడు.

## రేషన్ డీలర్లకు గుడ్ న్యూస్

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు:**
తెలంగాణ ప్రభుత్వం రేషన్ డీలర్లకు శుభవార్త చెప్పింది. రేషన్ డీలర్ల కమిషన్ ను క్వింటాల్ కు 70 నుంచి 140 రూపాయలకి పెంచుతున్నట్లు తెలిపింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నేడు (మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్ తదితరులు రేషన్ డీలర్ల సంఘాల జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రేషన్ డీలర్లకు హెల్త్ కార్డులు ఇవ్వడంతో పాటు కరోనాతో చనిపోయిన డీలర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు డీలర్ షిప్ ఇచ్చేందుకు తెలంగాణ సర్కార్ అంగీకరించింది.అయితే గత కొన్నాళ్లుగా రేషన్ డీలర్లకు భద్రత కావాలని.. ప్రభుత్వం ఇచ్చే కమిషన్ స్థానంలో వయస్సుతో సంబంధం లేకుండా గౌరవ వేతనం ఇవ్వాలని రేషన్ డీలర్లు పోరాటం చేశారు. 21 డిమాండ్లతో ప్రభుత్వానికి పలుమార్లు వారు వినతి పత్రాలు సమర్పించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్ల పాత్ర కీలకమని.. రైస్ మిల్లర్లకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని.. రేషన్ డీలర్లను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు.జూన్ 5 తరువాత సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అయితే అప్పుడు ప్రభుత్వం చర్చలు జరిపింది.. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామి హామీ ఇవ్వడంతో వారు వెనుదిగారు. ఇక, తాజాగా రేషన్ డీలర్ల సంఘాలతో భేటీలో ఈ విషయాలను కేసీఆర్ ప్రభుత్వం వెల్లడించారు. ఇక, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలంగాణ సర్కార్ ప్రజలపై వరాల జల్లు కురిపిస్తోంది. టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం దగ్గర నుంచి పలు సంక్షేమ పథకాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకోవడం వరకు అన్నీ స్పీడ్ గా జరుగుతున్నాయి.

## పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

**కమాన్ పూర్ - ప్రభాతసూర్యుడు:**
పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని పెద్దపల్లి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి అన్నారు. కమాన్ పూర్ మండల పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో రొంపికుంట పద్మశాలి భవనంలో 2022-23విద్యా సంవత్సరలో 10వ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ చాటి 10/10 జి పిఏ సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశాలి జిల్లా అధ్యక్షులు వేముల రామ్మూర్తి , అందె కోటయ్య సేఫ్టీ ఆఫీసర్ ఓసిపి 1, జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సత్తన్న గుండేటి రాజేష్ ,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అందె సదానందం గారు, కార్యదర్శి బూర్ల ధనుంజయ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచన మల్లయ్య మహర్షి బండారు సదానందం మంథని డివిజన్ కార్యదర్శి సిద్దిపల్లె సర్పంచ్ తాటికొండ శంకర్ ,మండల ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటేశ్వర్లు, సింగల్ విండో డైరెక్టర్ గుండేటి మూర్తి , వార్డ్ సభ్యులు పదాల సరోజ మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ కొండి శంకర్ , కుందారపు శంకరయ్య,కుందారపు శేఖర్, కొండి అనిల్, పడాల అజిత్,కొండి సాయి, కొండి నారాయణ, కొండి సంపత్, బొట్ల నరేష్, బంక పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతరం చలో కోరుట్ల పోస్టర్లు ఆవిష్కరించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215